**Eenadu**

# ఉపాధ్యాయ నియామక పరీక్షలో మార్పులు?

- ఐచ్ఛిక ప్రశ్నల స్థానే..వ్యాసరూప ప్రశ్నలు
- తరగతి బోధనా ప్రదర్శన అదనం
- తక్కువ విద్యార్థులున్న పాఠశాలల విలీనం
- విద్యలో నాణ్యత పెంపునకు తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ప్రణాళిక

ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ ఉపాధ్యాయుల ఎంపిక నిమిత్తం నిర్వహించనున్న డీఎస్సీలో భారీ మార్పులు చోటుచేసుకోనున్నాయా? బహుళ ఐచ్ఛికప్రశ్నలకు బదులు వ్యాసరూప ప్రశ్నలకు స్థానం కల్పించనున్నారా? ఈ ప్రశ్నలకు అవుననే సమాధానమిస్తోంది తెలంగాణ పాఠశాల విద్యాశాఖ.

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు, మౌలిక వసతుల కొరతపై సుప్రీంకోర్టులో దాఖలైన వ్యాజ్యంపై ఏడాదిగా విచారణ కొనసాగుతోంది. ఈ క్రమంలో విద్యార్థుల హాజరు, విద్యానాణ్యత పెంచేందుకు తీసుకునే చర్యలపై నివేదిక సమర్పించాలని జులై 13న సుప్రీంకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. కాగా..రూపొందించిన కార్యాచరణ ప్రణాళికతోపాటు.. విద్యలో నాణ్యత పెంపునకు తీసుకున్న చర్యలపై విద్యాశాఖ సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించింది.

## కార్యాచరణ ప్రణాళిక ఇదీ

ప్రస్తుతం బహుళ ఐచ్ఛిక ప్రశ్నలతో ఉపాధ్యాయుల నియామక పరీక్ష(డీఎస్సీ) నిర్వహిస్తున్నారు. ఎంపిక ప్రక్రియకు అదొక్కటే సరిపోదని భావిస్తున్నాం. వివరణాత్మక ప్రశ్నలతో(డిస్క్రిప్టివ్ టెస్టు) పరీక్ష నిర్వహించాలి. అదనంగా తరగతి బోధన నైపుణ్య ప్రదర్శన(డెమో) కూడా అవసరం. ఇందులో భాగంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న టెట్ ప్రాథమిక పరీక్షగా ఉపయోగపడుతుంది. అందులో అర్హత సాధించిన వారు ఉపాధ్యాయ నియామక పరీక్ష(గతంలో డీఎస్సీ..ఇకపై టీఆర్‌టీ)లో భాగంగా వ్యాసరూప పరీక్షను ఎదుర్కొంటారు.

- ప్రస్తుతం పదోన్నతుల ఆధారంగా ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ ఉద్యోగాలు భర్తీచేస్తున్నారు. ఇకపై కనీసం 30 శాతం ఉద్యోగాలు ప్రత్యక్ష నియామకంగా ద్వారా భర్తీ చేసే అంశాన్ని పరిశీలిస్తున్నాం.
- ఉపాధ్యాయుల్లో జవాబుదారీతనం పెంచేందుకు దశల వారీగా బయోమెట్రిక్ హాజరుయంత్రాలనుఏర్పాటు చేస్తాం.
- ప్రభుత్వ బడుల్లో కూడా పూర్వ ప్రాథమిక తరగతులు ప్రారంభించాలన్న తల్లిదండ్రుల కోరిక మేరకు అంగన్‌వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలతో అనుసంధానం చేస్తాం. శిశువులకు ఇచ్చే పౌష్టికాహారం, బోధనోపకరణాలు, ఆట వస్తువులను పాఠశాలలకు తరలిస్తాం. 2017-18 విద్యా సంవత్సరం నుంచి పూర్వ ప్రాథమిక విద్య శిక్షణలో భాగంగా జిల్లా విద్య, శిక్షణ సంస్థ(డైట్)ల్లో డిప్లొమా కోర్సులు ప్రవేశపెడతాం.
- ఆంగ్ల మాధ్యమ బోధనకు ఉన్న గిరాకీ దృష్ట్యా..ఈ విద్యా సంవత్సరమే డైట్లలో డీఈడీ ఆంగ్ల మాధ్యమం విభాగాన్ని ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది.
- ఒడిశా, తదితర రాష్ట్రాల నుంచి ఉపాధి కోసం తెలంగాణకు వలసొచ్చే వేలాది కుటుంబాల్లోని పిల్లలకు విద్యా బోధన అందించేందుకు వీలుగా కాలానుగుణ వసతిగృహాలు, (సీజనల్ హాస్టళ్లు), ప్రత్యేక పాఠశాలలు ప్రారంభిస్తాం.
- తక్కువ విద్యార్థులున్న పాఠశాలలను సమీపంలోని బడుల్లో విలీనం చేస్తాం. ప్రాథమిక పాఠశాలలో 100, ఆపైన, ప్రాథమికోన్నతలో 220, ఉన్నత పాఠశాలల్లో 200, అంతకుమించి విద్యార్థులు ఉండేలా చూస్తూ..అవసరమైనంత మంది ఉపాధ్యాయులను కేటాయిస్తాం.